## దృశ్యనాటిక :

# సంతాపసభ

## అగర-సూర్యారావు

స్థలం : హోటల్లో ఒక గది,

సమయం : సాయంత్రం ఆరు గంటలు.

[ గది మధ్య ఒక ద్వారం కనిపిస్తోంది. గదిలోకి వచ్చేవాళ్ళు తలుపు తెరుచుకొని ఆ ద్వారంనుంచే రావాలి, వెళ్ళినా అదే దారి. మరో మార్గంలేదు. గదిలో చక్కగా అలంకరించిన ఒక టేబులూ—ఆ వెనుక ఒక కుషన్ కుర్చీ వున్నాయి. టేబులు మీద ఫ్లవర్ వేజ్ వుంది. టేబులుకు రెండు వైపులా ఇటు మూడూ అటు మూడూ ఆరు కుర్చీలు వున్నాయి. ఒక కుర్చీ మీద గోపాలం కూర్చుని పుస్తకం చదువుతూ వుంటాడు. సన్నగా, పొట్టిగా వున్నాడు. వయస్సు 25. తలుపు తెరుచుకొని శిరోమణి వస్తాడు. వయస్సు 50 సంవత్సరాలు. లాల్చీ, పంచెకట్టు, కాశ్మీరు శాలువా, అంటకత్తిరివేసిన జుత్తు, చేతిలో కొన్ని పుస్తకాలు. చూడగానే ప్రాచీనకవి అని తెలుస్తుంది. ]

**శిరోమణి** : (సూటిగా) రమణయ్యగారు రాలేదా ?

**గోపాలం** : వచ్చారు. ఏదో పనిమీద వెళ్ళారు. ఇప్పుడే వస్తారు. కూర్చోండి.

**శిరో** : (కూర్చుని - నవ్వుతో) నీ పేరేమిటి ?

**గోపా** : గోపాలం.

**శిరో** : ఇవేళ ఈ సమావేశం జరగడంలో గల ఉద్దేశం ఏమిటో నీకు తెలుసునా ?

**గోపా** : (తేలిగ్గా) రఘుపతిగారు పోయినందుకు మన సంతాపం తెలియిచెయ్యడమే ఉద్దేశం

**శిరో** : అది కాదయ్యా మహానుభావా ! మన రమణయ్యగారు సభ అంటూ పెట్టారంటే, అందుకు పైకి కనిపించే కారణం ఒకటి వుంటుంది. 'లోపాయికారీ' కారణం మరొకటి వుంటుంది.

**గోపా** : అయితే, నాకు లోపాయికారి కారణం తెలియదండి.

**శిరో** : నువ్వింకా కుర్రవాడివి నాయనా ! నీ కింకా రాజకీయాలు తెలియవు. ఎత్తులూ, పైఎత్తులు వేస్తూవుంటేకానీ అసలు పేరు రాదు. నీ మానాన్ని నువ్వు ఎన్ని కథలు రాసినా, ఎంత కవిత్వం రాసినా - నీకు అటు కీర్తిరాదు; ఇటు డబ్బూ రాదు.

**గోపా** : (చిరునవ్వుతో) రచయిత రాజకీయవేత్త అయితేనే కీర్తీ, డబ్బూ వస్తుందంటారా ?

**శిరో** : మహారాజులాగ ! - మన రాజధానిలో ఒక కవిగారు ఉన్నారు. ఆయన రాసినదంతా తుక్కు అని కొందరంటారు. ఎవరు ఎన్ని అంటే ఏం ప్రయోజనం ? ఈనా అతనికి వున్న పేరూ, పరపతీ మరెవ్వరికీ లేవు.

**గోపా** : మంచి కావ్యాలు రాయకుండా ఆయన పేరు ఎలా సంపాదించగలిగారు?

**శిరో** : (తేలిగ్గా) అహ ! అందులో ఏముంది ? కొత్తగా వచ్చిన ప్రతి ముఖ్యమంత్రికీ ఒక పుస్తకం అంకితం ఇస్తూ ఉంటాడు. పెద్ద బహిరంగ సభ జరుగుతూ వుంటుంది, తన స్నేహితుల్ని శిష్యుల్ని ఉపన్యాసకులుగా వేస్తాడు. ఎవరు ఏవిషయం గురించి ఏ విధంగా మాట్లాడాలో ముందే నిర్ణయిస్తాడు. అందులో కొందరికి ఉపన్యాసాలు తనే రాసి

యిస్తాడు. నేలరోజులు ముందునుంచీ అచ్చంగా నాటకం రిహార్సల్సులాగా - ఏ మాట ఎక్కడ నొక్కి చెప్పాలో ఏ పద్య పాదం ఎక్కడ రాగం తీసి చదవాలో - ప్రాక్టీసు చేయిస్తాడు. సభ మంచి పకడ్బందీగా - అద్భుతంగా జరిగి పోతుంది. పేపర్లన్నీ మొదట పేజీలో - సచిత్రంగా వార్త అచ్చువేస్తాయి. పుస్తకాలన్నీ వెంటనే చెలామణీ అయి పోయి చేతికి డబ్బొస్తుంది. కీర్తికి కీర్తీ వస్తుంది. డబ్బుకి డబ్బూ వస్తుంది. ఇంకేం కావాలి నీకు!

గోపా : ఆయన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలంటారా ?

శిరో : తప్పదు నాయనా! తప్పదు! అతగాడు మనమీద పోటీ పడి పైకి లేచిపోతూవుంటే చూస్తూ ఎలా ఊరుకోగలం? మనకు చేతనైతే అంతకంటే పై యెత్తు వెయ్యాలి. చేత కాకపోతే ఆ ఎత్తే మనమూ వెయ్యాలి. ఉదాహరణకు చిన్న సంగతి! నువ్వు చాల పత్రికలలో చాలా కథలు రాశావు. కానీ నీకు పేరు రాలేదు. రాజధానిలో కొన్ని కొందరు రచయితల్ని చూడు. వాళ్ళు నీ కథలకంటే చచ్చు కథలు రాశారు. పెద్ద పేరు సంపాదించారు.

గోపా : వాళ్ళ కథలకు పేరు రాలేదండి! వాళ్ళకు మాత్రమే కీర్తి వచ్చింది. వాళ్ళురాసిన మంచి కథపేరు ఒక్కటి చెప్ప మనండి!

శిరో : నువ్వింకా సత్యకాలంలోనే వున్నావు నాయనా! నీ వెర్రి కాని, మంచికథలు, కవిత్వం రాస్తే పేరొస్తుందను కుంటున్నావా? ఎప్పుడూ రాదు!_
రచయిత కానీయ్, కవి కానీయ్ - తనంతట తానే పేరు తెచ్చుకోవాలి. రాజధానిలో ఒక బ్రహ్మాండమైన సభ జరి గిందనుకో, "ఓహో! ఫలానా రచయిత శివరామ్‌గారు వచ్చారు! ఫలానా చక్రవర్తిగారు వచ్చారు. ఫలానా శిరో మణిగారు వచ్చారు!" అంటారు కానీ — ఫలానా బ్రహ్మాండమైన పుస్తకం రాసిన కవిగారొచ్చారని మాత్రం అనరు. కథలకు, కావ్యాలకు పేరురాకుండా రచయితలకు పేరెలా వస్తుందని నీకు సందేహం రావచ్చు.

గోపా : నిజమేనండి! ఎలా వస్తుంది పేరు?

శిరో : దానికో సూత్రం వుంది. నువ్వు ఏ తుక్కు పుస్తకం రాసినా - దానికి నువ్వే బ్రహ్మాండమైన ప్రచారం చెయ్యాలి! పుస్తకాన్ని ఒక గొప్పవాడికి అంకితమియ్యి. మంత్రిగారయితే మరీ మంచిది. ఆవిష్కరణ మహో త్సవం జరిపించు. ఏ సభ అయినా - అసలు విష యంతో ప్రమేయం లేకుండా - మహోపన్యాసం చెయ్య గల పండితులు మన ఆంధ్రదేశంలో ఎంతోమంది వున్నారు. వాళ్ళు చింతపండు నుంచి సినిమా స్టార్లవరకూ, నన్నయనుంచి చిన్నయవరకూ, లాలా లజపతిరాయినుంచి లక్ష్మణదాసువరకూ అనర్గళంగా మాట్లాడగలరు. వాళ్ళను ఉపన్యాసకులుగా వేసెయ్. సభ ప్రారంభంనుంచి ముగింపు వరకూ రామనామ స్మరణలాగ నీ పేరే వినిపిస్తుంది. నీకు పేరు రావాలంటే సూక్ష్మంగా ఒక్క మాటలో చెబు తాను. నీ పేరు కొన్ని వందలసార్లయినా నాయకుల చెవిని పడుతూ వుండాలి. దాన్తో నీ పేరు ప్రభుత్వంవారు నిర్వహించే ప్రతి సాంస్కృతిక సంఘంలోనూ వుంటుంది.

[తలుపు ఆకస్మికంగా తెరుచుకుంటుంది. రచయిత్రి భర్త సత్యమూర్తి లోపలికి వస్తాడు. కనుబొమలు ముడుచు కొని వున్నాయి. వయస్సు 30 దాటుతుంది.]

గోపా : (అతన్ని చూడగానే) రండి సత్యమూర్తిగారూ! ఏమిటలా చూస్తున్నారు? కూర్చోండి.

సత్యమూర్తి : రమణయ్యగారు లేరా?

గోపా : ఇప్పుడే వస్తారు.

శిరో : (సత్యమూర్తిని పరిశీలనగా చూస్తూ - గోపాలంతో) గేయాలూ, పద్యాలూ రాసే సత్యమూర్తిగారు వీరేనా?

గోపా : కాదండి. వీరు మన రచయిత్రి భర్త సత్యమూర్తిగారు!

శిరో : ఓహో, అలాగా!

గోపా : కూర్చోండి. ఏమిటాలోచిస్తున్నారు?

సత్య : (నిర్లక్ష్యంగా) నేను కూర్చోడానికి రాలేదు. మా ఆవిడకి వంట్లో సరిగాలేదు. సభకు రాలేదని చెప్పడానికి వచ్చాను.

గోపా : ఈ సంగతి రమణయ్యగారు కూడా చెప్పారండి!

సత్య : (రవంత ఆశ్చర్యంతో) ఏ సంగతి?

గోపా : మీవారికి ఆరోగ్యం సరిగాలేక సమావేశానికి రాలేకపోతే, ఆవిడ ప్రతినిధిగా మిమ్మల్ని సమావేశంలో పాల్గొనమని రమణయ్యగారు చెప్పారు.

సత్య : (మరింత ఆశ్చర్యంతో) ఈ సంగతి ఆయనకు ముందుగా ఎలా తెలిసింది చెప్మా!!

గోపా : ఆయన ఈపాటికి వస్తూ ఉంటారు. కూర్చోండి. (సత్య మూర్తి కూర్చుంటాడు)

శిరో : మన సంఘంలో ఒక సభ్యుడు కీర్తిశేషుడయితే-సంతాపం తెలియచేసే పద్ధతి ఇదా? బ్రహ్మాండమైన బహిరంగ సభ పెట్టి, యావన్మంది ప్రజలకూ తెలిసేలాగ చెయ్యడం ధర్మం!

సత్య : అసలు రఘుపతిగారు ఎప్పుడు చచ్చిపోయారు? జబ్బే మిటి?

శిరో : జబ్బూ కాదు; మన్నూ కాదు - ఆత్మహత్య!



**సత్య :** (ఒక్కసారిగా) ఏమిటీ! చేతులారా ప్రాణాలు తీసుకున్నాడా? (కోపంతో) అలాంటివాడి చావుకు మనం యిప్పుడు సంతాపం తెలియచెయ్యాలా? (అమాంతంగా లేచి) నాకుకాని, మా ఆవిడకుకాని ఈ సభలో వుండవలసిన అవసరం లేదు. వేం వెళ్ళవస్తాం.

**శిరో :** (వెంటనే) అయ్యా! (సత్యమూర్తి ఆగి, వెనక్కి తిరిగి చూస్తాడు) బహువచనం ఎందుకు? మీ రొక్కరేకదా వెళుతున్నారు!

**గోపా :** సత్యమూర్తిగారూ! ఆగండి. మీ అభ్యంతరం సంగతి రమణయ్యగారికే తెలియచేసి వెళ్ళడం మంచిది.

**సత్య :** సరే. ఎలాగూ వచ్చానుకదా ఆయనతో మాట్లాడే వెళతాను. (కూర్చుంటాడు)

**శిరో :** కీర్తిశేషుడు, మన రఘుపతి రామధేయుడు రాసిన ఉద్గ్రంథాలు ఏమిటీ అంట?

**గోపా :** ఆయన ఎన్నో కథలు రాశాడు. రెండు నవలలు రాశాడు. ఆధునిక రచయితలలో అగ్రశ్రేణికి చెందినవాడని విమర్శకులు మెచ్చుకున్నారు. కానీ. ఏం లాభం? ఆయన రచనలేవీ పుస్తక రూపంలో రాలేదు.

## పాత్రలు

***

| | |
|---|---|
| రమణయ్య | సత్యమూర్తి |
| శిరోమణి | గోపాలం |
| పరశురాం | చంద్రశేఖరం. |
| జగన్నాధం | |

**సత్య :** ఒక్క పుస్తకమైనా అచ్చవకుండా పేరెలా వచ్చిందీ?

**గోపా :** పత్రికలండీ, పత్రికలు! ఈనాడు ఆంధ్రదేశంలో ఇంతమంది రచయితలు వున్నారంటే, అది పత్రికల చలవే!

**శిరో :** మరి ఊరూరా యిన్ని ప్రచురణ సంస్థలున్నవికదా, ఆ సంస్థలు ఉత్తమ సాహిత్యం తమంత తామే సేకరించి ప్రచురించలేదా?

గోపా : నిజం చెబితే కోపం వస్తుంది. అయినా చెబుతాను. మన ప్రచురణకర్తలలో కొందరిని మినహాయిస్తే — మిగిలిన వాళ్ళు సొంతంగా మంచి చెడ్డలు నిర్ణయించలేరు. పత్రికలు బహుమతులిచ్చిన నవలలు, కథలను మాత్రమే వాళ్ళు డబ్బిచ్చి కొని ప్రచురిస్తారు. ఏ పోటీకి వెళ్ళకుండా ఉత్తమ నవలలు, కథలు రాసిన రచయితకు కీర్తిగాని డబ్బు లేదు.

శిరో : అయితే, మా పద్ధతే బాగుందన్నమాట !

గోపా : ఏమిటా పద్ధతి ?

శిరో : మాకు అసలు ప్రచురణకర్తల అవసరమే లేదు.

గోపా : మరి మీ పుస్తకాలు ఎవరు ప్రచురిస్తున్నారు ?

శిరో : మేం ఎవరికి అంకితం ఇస్తే వాళ్ళే ప్రచురించుకుంటారు. ప్రచురించడమేకాక, పదరు వెయ్యి ప్రతులూ మాకే ఇస్తారు. అందులో కనీసం వంద పుస్తకాలమ్మినా చాలు !

సత్య : అమ్ముడు కాకపోయినా మీకు నష్టంలేదు. అయ్యా ! నాగమణిగారూ....

శిరో : నా పేరు నాగమణి కాదు, శిరోమణి !

సత్య : అదే ! శిరోమణి గారు ! — మా ఆవిడ కథలు అంకితం పుచ్చుకొనే వాళ్ళెవరైనా వుంటే చూసి పెడుదురూ ! నా అంతట నేనే అచ్చువేస్తాను.

శిరో : ఈ విద్యలో రమణయ్యగారు నా కంటే గొప్పవారు— ఆయన్ని పట్టుకోండి.

[తలుపు తెరుచుకొని : రఘురాం కోపంతో ప్రవేశిస్తాడు. జీబురు జుత్తు, లాల్చీ, షరాయి, వయస్సు 28]

పరశురాం : (వస్తూనే సీరియస్‌గా) ఏరీ ! రమణయ్యగారెక్కడ ? "నాంపల్లి" లాంటి నగరురోడ్ల కూడలిలో - నడిరోడ్డు మీద పెట్టవలసిన మహాసభ ! - మహాసభను సెన్సారుచేసి కత్తిరించి ముక్కముక్కలుచేసి - చిన్ని సమావేశంగా మార్చి — మారుమూల హోటలు గదిని సమావేశ స్థలంగా కూర్చి — చచ్చినవాణ్ణి మరోసారి చావ మోదడమా ?— ఎక్కడ - రమణయ్యగారెక్కడ ? లేచిపోయి వచ్చిన ప్రేయసీ ప్రియులలా హోటల్ గదిలో సమావేశమా ? ప్రజల ముఖం చూడని మహామంత్రిలా మారుమూల హోటల్లో కూర్చుని సంతాపం తెలియ చెయ్యడమా ?— ఈ బూర్జువా నాగరికతను మన నెత్తిని రుద్దడానికి రమణయ్యగారి కెవరు హక్కు ఇచ్చారు ?

గోపా : (ప్రశంసిస్తూ) మీ వచన గేయం అమోఘంగా వుంది పరశురాంగారూ ! కూర్చోండి. రమణయ్యగారు వచ్చే వేళయింది.

పరశు : (సూటిగా) ఎవరైనా మతోన్మాదిదిగాని, కోటీశ్వరుణ్ణిగాని పట్టుకురావడానికి వెళ్ళారా ?

గోపా : నాకేమీ చెప్పలేదు.

పరశు : (కూర్చుని) మణిలాంటివాడు పోయాడు. ఏం చేస్తాం ? అలాంటి ఆదర్శ రచయిత చూద్దాం అంటే కనిపిస్తాడూ ! హేమాహేమీలొచ్చినా వెనకడుగు వెయ్యలేదు. డబ్బుకు లొంగిపోలేదు. ఏడీ, శేఖరం ? ఇంకా రాలేదా ? కొంప తీసి ఈ సమావేశాన్ని నిషేధించలేదుకదా ?

గోపా : రఘుపతికి ఆయన ప్రాణస్నేహితుడు. కనక, ఈ సమావేశానికి తప్పకుండా వస్తాడు.

పరశు : అప్పుడే అరయ్యింది. ఇంకా రాలేదే ?

గోపా : ఆయన సరాసరి ఆఫీసునుంచి ఇక్కడికే రావచ్చు.

శిరో : (ఆకస్మికంగా) ఏమిటీ ! శేఖరానికి ప్రత్యేకించి ఒక ఆఫీసు వుందా ? అతని నాటకాలకు అంత చెలామణీ వుందన్నమాట !

గోపా : అది కాదండీ ! ఆయన ఒక పెద్ద ఆఫీసులో చిన్న గుమస్తా.

పరశు : (శిరోమణితో) మీ పెత్తందార్లూ, మీ బూర్జువాల్లూ రచయితను రచయితగా బతకనిస్తారా ?

శిరో : మధ్యని నేనేం చేశానయ్యా మహానుభావా ?

పరశు : మీరంటే మీరుకాదు. మీరు ఎవరి తరపున వకాల్తా పుచ్చుకొని వాదిస్తారో — ఆ రాజకీయ దురంధరులు ! మనిషిని ఒకేసారి చంపకుండా స్లో పాయిజన్ లాంటి ఆర్థిక వ్యవస్థను సృష్టించి — దానితో సామాన్యుణ్ణి తీసుకు తీసుకు చచ్చేలా — చేసే నేర్పు మీ కౌటిల్యులకు వుంది. బూర్జువా రాజ్యాంగంలో ప్రతిరాష్ట్రానికి ఒక కౌటిల్యుడు వున్నాడు. అందరికంటే పెద్ద కౌటిల్యుడు ఇంద్రప్రస్థంలో వున్నాడు.

శిరో : బూర్జువా అన్నది తెలుగుపదం కాదు. నువ్వు అప్రాచ్యపు భాషలో నిందిస్తే నేను అచ్చ సంస్కృతంలో నిందించవలసి వుంటుంది.

పరశు : (వెంటనే) అందుకు నేను తయారుగా వున్నాను. దూషణ భూషణ తిరస్కారాలను — నమస్కారాలను సమానంగా స్వీకరించి — నా అక్షర తూణీరంలోంచి బాణంలాగి— ప్రతిపక్షి పక్షం తెగనరుకుతాను. నా వాదానికి లొంగి — నా పక్షం చేరిన మేధావిని - నలభైకోట్ల నరనారీ మణులకు దరిద్ర నారాయణీ నారాయణులకు నాయకుడుగా చేస్తాను. వాళ్ళ నెత్తురు పీల్చే మున్నూరు పులులను బోనులలో పెట్టిస్తాను శిక్షిస్తాను.

శిరో : (హేళనగా) ఇది దరిద్ర నారాయణ కవిత్వమా ?

గోపా : ఇవి వచన పద్యాలండీ! ఆధునిక కవులలో పరశురాం గారికి మంచిపేరు వుం!

శిరో : వచన పద్యా లేమిటోరీ, శ్రాద్ధం!

పరశు : అలనాడు - వచన పద్యాలనే దుడుకరలతో - పద్యాల నడుములు విరగ్గొట్టాడు పూర్వీకుడొకడు! (స్వగతం) ఇప్పుడు అస్త్రసన్యాసం చేసి బిరుదంతస్తుల మేడలో కూర్చున్నాడు.

శిరో : ఛందస్సు రానివాళ్ళు, యతిప్రాసలు తెలియనివాళ్ళు కూసే పిచ్చికూతలన్నీ వచన పద్యాలా? నేనొక సమస్య యిస్తాను - నీకు చేవవుంటే పూరించు చూద్దాం.

పరశు : ఛందానికి ఛందం, కందానికి కందం, గీతానికి గీతం, సీసానికి సీసం - దేనికైనా తయారు. క్లాసికల్, రాసీయ్ - నీ వాగ్బాణం!

శిరో : (గోపాలంతో) అబ్బాయ్! నువ్వు మధ్యవర్తివి. (పరశురాంకేసి తిరిగి) ఇదుగో, పద్య పాదం ఇస్తున్నాను. (రాగం తీసి చదువుతూ "మాన్యుడవు వదాన్యుడవయ్య మంత్రివర్య!". ఇది పూర్తిచెయ్యి చూదాం!

పరశు : (తేలిగ్గా) ఇంతటి చిన్న సమస్యా? సునాయాసంగా, మంచినీళ్ళ ధారలా ఆశుకవిత్వం చెబుతున్నాను. యావన్మందీ విని ఆనందించండి. (పద్యం చదువుతాడు)

> ప్రజల మెప్పుకై పైకి తిరుపతికి వెళ్ళి
> దేవుడికి మొక్కి జీడి గొంతు నొక్కి
> ధరలు పెంచి కరువు పుట్టించితివి నువ్వు
> మాన్యుడవు వదాన్యుడవయ్య మంత్రివర్య!

శిరో : (వెంటనే) యతి భంగం! రెండు పాదాలలో యతి తప్పి పోయింది.

పరశు : మహా మహా కవిసార్వభౌముల మాటే వినడు యతి! మేం ఏనాడో యతిప్రాసలకు స్వేచ్ఛ యిచ్చాం. ప్రాస కోసం యేడ్చి బాధపడే జాతికాదు మాది!

శిరో : కవిశేఖరుల జాతిని దూషించడం అధర్మం!

పరశు : ఏది ధర్మం? ఏది అధర్మం? ఓ మహాత్మా! ఓ శిరోమణీ! వ్యాపారం ముసుగుతో - వొళ్లొంచి శ్రమపడిన వాడి సంపాదన దోచి గుండమీద మేజువాణీ పెట్టినవాడిది ధర్మమా? ఎంత శ్రమించినా కడుపు పండక - నిండిబిడ్డానికి నీడలేక - మాడి మాడి చచ్చేవాడిది అధర్మమా? ఇదుగో ఇదుగో! నా కలం! హలం పట్టి పొలం దున్నినవాణ్ణి రోజంతా శ్రమించిన రైతు కూలీని - కృషిచేసి కృశించిన కృషీవలుణ్ణి - రాజ్యానికి రాజును చేస్తా! కుషన్ కుర్చీ మీద కూర్చుని తాత ముత్తాతల సంపాదనతో - తనకు షేరు వున్న బ్యాంకులో ఓవర్ డ్రాఫ్టుతో - పండిన పంటంతా కారుచవకగా కొని - తిండిగింజల్ని చీకటి కొట్లో దాచి - కరువు సృష్టించి - ధరలు పెంచి - కష్టజీవుల కడుపు మాడ్చి చంపే - భోగులను - సుఖజీవులను - ఫ్యాక్టరీలకు తోలేస్తా! శ్రమలోని మజా రుచి చూపిస్తా!

సత్య : అయ్యా! పరశురాంగారూ! ఎందుకొచ్చిన కవిత్వం యిది! మంచి నవల ఒకటి రాయకూడదూ? ఇప్పుడు నవలలకు వున్న మార్కెట్టు దేనికీలేదు.

పరశు : మార్కెట్టు నవలలు రాసే మార్కెట్టు కవిని కాను నేను! పామరులకు సోమరులకు పనికొచ్చే నవలలు రాయను నేను! పామరుణ్ణి పండితుడుగా మార్చేదీ - సోమరిలోని సోమరితనాన్ని హరించేదీ - నిత్యం చిగురించేదీ - నిద్ర నుంచి మేల్కొలిపేదీ - నవ్య కవిత - దివ్యకవిత సృష్టిస్తాను. గొగోల్ ఓవర్ కోటు, కుప్రిన్ యమకూపం, మొరావియో రోమన్ స్త్రీ - లాంటి నవలలు వస్తే స్వాగతమిస్తాను.

[రమణయ్య తొందరగా తలుపు తెరుచుకుని ప్రవేశిస్తాడు]

రమ : (వస్తూనే) ఒక శుభవార్త!

పరశు : ఏమా శుభవార్త? ఎవరైనా లక్షాధికారి మీ పుస్తకం అంకితం పుచ్చుకుంటున్నాడా?

రమ : ఆగండి మహానుభావా! (సత్యమూర్తితో) మీరు ఒక్కరే వచ్చారా?

సత్య : అవునండీ! మా ఆవిడకు వంట్లో సరిగాలేదు.

శిరో : (వెంటనే) రమణయ్యగారూ! మీరు ఏదో శుభవార్త అంటూ ఆగిపోయా రేమిటి?

రమ : (నాటక ఫక్కీలో) చిన్న శుభవార్త కాదు. చాలా పెద్ద శుభవార్త. ప్రఖ్యాత రాజకీయవేత్త, పాలకవర్గానికిచెందిన వారు, సారస్వత ప్రియులు అయిన జగన్నాథంగారు మన సమావేశానికి ఒక క్షణంలో రాబోతున్నారు.

[పరశురాం ముఖంలో తప్ప అందరి ముఖాలలోను ఆత్రుత, ఆనందం కనిపిస్తాయి]

సత్య : (తొందరగా) మీరు ముందే ఎందుకు చెప్పలేదూ? మా ఆవిణ్ణి తీసుకొద్దును గదా?

రమ : నాకు ముందు తెలిస్తే కదూ చెప్పడానికి! అందులోనూ వంట్లో బాగా లేనప్పుడు ఆవిణ్ణి బాధపెట్టడం మంచిది కాదు.

శిరో : (వెంటనే) ఎంతపని చేశారు రమణయ్యగారూ? ఒక్క పూట ముందు చెప్పినా - రెండు చక్కని పద్యాలు వారి మీద రాసి చదివేవాణ్ణి కదా!

రమ : ఫరవాలేదు శిరోమణిగారూ! లోగడ మీరు ఎందరో రాజకీయవేత్తలమీద పద్యాలు రాశారు. అందులో ప్రస్తుతానికి సరిపోయేది ఒకటైనా ఉండకపోదు. అది చదివితే సరిపోతుంది.

శిరో : ఆ మాటా నిజమే! ప్రయతిస్తాను.

[తన చేతిలో ఉన్న పుస్తకం తిరగేస్తూ వుంటాడు.]

సత్య : (అనుమానంతో) అయ్యా, రమణయ్యగారూ! ఈ క్షణం వరకూ ఆయన వస్తున్నట్టు నిజంగా మీకు తెలియదా?

రమ : ఏమాత్రం ముందు తెలిసినా మహాసభ ఏర్పాటు చేద్దును. పావుగంట క్రితం రోడ్డుమీది వెళ్ళేవరకూ నాకేమీ తెలియదు. రోడ్డుమీద పోలీసు బందోబస్తు కనిపించింది. 'ఏమిటీ సంగతి' అని ఆరా తీస్తే జగన్నాథంగారొస్తున్నారు. వెంటనే వారి కారు ఆపుచేసి, మా సమావేశంలో పాల్గొనాలని కోరాను. ఆయన అంగీకరించారు. కింద హాల్లో పత్రికలవాళ్ళెవరో ఆయనను ఆపుచేశారు. తీసుకు వస్తాను (తలుపు తీసి అవతల అడుగుపెట్టి - వెంటనే లోపలికి తిరిగి) వారే స్వయంగా దయచేస్తున్నారు.

[జగన్నాథం ఠీవిగా ప్రవేశిస్తాడు. రమణయ్య ఆదరంతో]

ఇటూ యిటూ! ఇటు దయచెయ్యండి. (మధ్యనవున్న కుషన్ కుర్చీమీద జగన్నాథం కూర్చుంటాడు.)

జగ : (రమణయ్యతో) ముందు మీ రచయితలను పరిచయం చెయ్యండి.

రమ : చిత్తం! చిత్తం! ముందు నన్ను నేనే పరిచయం చేసుకుంటాను. తరవాత అందరినీ వరసగా పరిచయం చేస్తాను

[శిరోమణి రమణయ్యకేసి కోపంగా చూస్తాడు]

జగ : [ఆమోదిస్తూ] బాగుంది, కానివ్వండి.

రమ : నేను ఈమధ్యనే రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాను. ఈ పదవికి నేను నూటికి నూరుపాళ్లు అర్హుడినని ఆత్మ విశ్వాసం నాకు వుంది.

పరశు : [కోపంతో] మీ అర్హత నిర్ణయించవలిసింది మేము. మీరు కాదు.

శిరో : (సంతోషంతో) పరశురామయ్యగారితో నేను ఏకీభవిస్తున్నాను. అర్హత, అనర్హతలజోలి విడిచిపెట్టి, సూటిగా పరిచయం ముగించండి.

రమ : చిత్తం! చిత్తం! నేను చిన్నప్పుడు కాలేజీలో చదువుకునే రోజుల్లో....



పరశు : ఇదీ ఏదో పెద్ద కథలా, ముగింపులేని మహాకావ్యంలాగ వుంది !

రమ : లేదు పరశురాంగారూ క్లుప్తంగా ముగిస్తాను. (తన ప్రసంగం కొనసాగిస్తూ) నేను కాలేజీలో చదువుకొనే రోజుల్లో - మాకు తెలుగు లెక్చరర్‌గా వున్న ఒక మహాకవిగారి చలవవల్ల-శృంగార నాయికల లక్షణాలు కూలంకషంగా తెలుసుకొని, కావ్యరచన కుపక్రమించాను. సారస్వతంలో అన్ని శాఖలలోనూ యింతో అంతో కృషి చేశాను. కథ, నవల, నాటిక, నాటకం, ఖండకావ్యం, అఖండకావ్యం, పరభాషా రచనలకు అనువాదం, అనుసరణ - బహుముఖాల కృషి చేశాను. హాస్యరసానికి ప్రాధాన్యం వున్న "శివపట్ల గోత్రం" అనే ఖండకావ్యం రాసి నా సహాధ్యాయి, ప్రస్తుతం దేశనాయకుడూ అయిన రంగయ్యగారికి అంకితం ఇచ్చాను. నా గురించి ఇంత కంటే ఎక్కువ చెప్పకుంటే ఆత్మస్తుతి అని ఎవరైనా అపార్థం చేసుకోవచ్చు

పరశు : ఫరవాలేదు. ఆత్మస్తుతి చేసుకునే హక్కు ప్రతివాడికీ వుంది. వినేవాళ్ళు చెవులు కొరికినప్పుడు సంక్షేపంగా ఆత్మస్తుతి చేసుకోవచ్చు.

రమ : ఇక మా రచయితలను పరిచయం చేస్తాను. (గంభీర స్వరంతో) శిరోమణిగారు ! (శిరోమణి లేచి వినయంగా నిలబడతాడు) ప్రాచీన సంప్రదాయాలను నశించిపోకుండా కాపాడుతూ ఛందోబద్ధమైన, అలంకారయుతమైన కవిత్వం చెప్పేవారిలో శ్రీ శిరోమణిగారు ప్రముఖులు. వీరు రాసిన గ్రంథాలను కుబేరులవంటి ధనవంతులు, బ్యాంకు డైరెక్టర్లు, మంత్రులు అంకితం పుచ్చుకున్నారు. ఉన్నత వర్గాలలో వీరికి వున్న ఆదరం మాటలతో చెప్పడానికి వీలు లేనిది. వీరి శైలి రచనం జటిలమైనదైనప్పటికీ, ఆస్వాదించగలవారికి మృదు మధురంగా వుంటుంది.

పరశు : పాషాణ పాకానికి మృదుత్వం ఒకటా ?

రమ : వీరికిగల సారస్వతాభివర్ధనం వర్ణించరానిది. [illegible]సికంగా ఏ సారస్వత సభ జరిగినా, సదరు సభకు వీరిని పిలిచినా పిలవకపోయినా తప్పకుండా హాజరవుతారు. ప్రతి సారస్వత సభలోనూ వీరికి పాత్ర వుంటుంది.

పరశు : విదూషకుడి పాత్ర !

రమ : వీరి కవిత్వానికి ఉప్పొంగి వీరి ప్రతిభను గుర్తించి సారస్వత ప్రియుడైన ఒక రాజకీయవేత్త వీరికి ప్రమోషన్ ఇప్పించారు.

పరశు : పెట్టుబడిదారీ సమాజంలో న్యాయసూత్రం !

[తలుపు తెరుచుకొని చంద్రశేఖరం ప్రవేశిస్తాడు.]

రమ : [చంద్రశేఖరాన్ని చూడగానే సంతోషంతో] రండి, రండి! సరిగా సమయానికి వచ్చారు. [జగన్నాథంకేసి తిరిగి చంద్రశేఖరాన్ని పరిచయం చేస్తూ] వీరి పేరు చంద్రశేఖరంగారు. పేరు వున్న రచయితలలో ఒకరు. వీరు నాటక రచనలో కృషి చేస్తున్నారు. వీరి నాటకాలలో అతివాద ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. అదే వీరిలోని లోపం.

పరశు : [వెంటనే లేచి] అతివాద ధోరణి లోపమా ? నిజం ముక్కుమీద గుద్ది చెప్పిన ప్రతివాడూ అతివాదే! నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పగల రచయిత సమాజానికి కావాలి. అతడే సమాజంలోని మెజారిటీ వర్గానికి చెందిన కవి. రేపు ఉదయించబోయే నవసమాజపు సూర్యుడి అరుణ కిరణం అతివాద కవి. అతడే ప్రజా రచయిత. మహాకవి !

రమ : పరశురాంగారూ! దయచేసి నా పరిచయం పూర్తికానివ్వండి [పరిచయం కొనసాగిస్తూ] చంద్రశేఖరంగారిని జనం సాధారణంగా మార్క్సిస్టు అనుకుంటారు. నిజానికి ఆయనకు ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యత్వం లేదు. ఏ యిజ్మూ కాదు. కేవలం హ్యూమనిస్టు మాత్రమే. వీరి రచనలకు ప్రజాదరణ మాత్రమే వుంది. ఏ విధమైన బహుమతులూ లభించలేదు. వీరి నాటకాలు రేడియోలో కూడా వచ్చాయి. తమరు వినే వుంటారు.

జగ : [చిరునవ్వుతో] విన్నాం ! విన్నాం !

రమ : వీరు పబ్లిసిటీకోసం ప్రయత్నించరు. ఎక్కడికీ వెళ్ళరు. ఇక్కడ ఒక ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నారు. [ఈ చివరి మాట వినగానే వికసించిన జగన్నాథం ముఖం ముడుచుకుపోతుంది. చంద్రశేఖరంతో] వీరు సుప్రసిద్ధ నాయకులు జగన్నాథంగారు.

చంద్ర : [జగన్నాథంకేసి తిరిగి] నమస్కారం ! [జగన్నాథం కనుబొమలు చిట్లించి - చంద్రశేఖరంకేసి తేలిక భావంతో చూస్తాడు. నమస్కారం అందుకోడు. చంద్రశేఖరం పరిస్థితి గమనించి - చిరునవ్వుతో - పరశురాంకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటాడు.]

రమ : గోపాలంగారు ! [గోపాలం లేచి నిలబడతాడు.] వీరు ఎన్నో కథలు, నవలలు రాసిన; రాస్తున్న వర్ధమాన రచయిత, యువ రచయితలకు సహజమైన శృంగార రసానికి వీరి రచనలలో ప్రాధాన్యం వుంది. స్త్రీల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వుంది. [గోపాలం కూర్చుంటాడు.] సత్యమూర్తిగారు ! [సత్యమూర్తి లేచి నిలబడతాడు.] సుప్రసిద్ధ రచయిత్రి, మన రచయితల సంఘానికి శిరోభూషణము....

పరశు : [వెంటనే] మనకు శిరోమణిగారు ఒకరు ఎలాగూ వున్నారు. మరో శిరోభూషణం కూడా ఎందుకు ? బిరుదు మార్చండి.

శిరో : [ముసి ముసి నవ్వులు ముఖంలో కనిపిస్తాయి.]

రమ : (స ధోరణిలో) స్త్రీ బాలయో సులను ఉద్రూతలూగి చే నవల లెన్నో రచించిన, రచిస్తున్న ప్రముఖ రచయిత్రి సుందరమ్మగారి భర్త! సత్యమూర్తిగారి ప్రోద్బల ప్రోత్సాహంతో. సానుభూతి సహకారాలతో సుందరమ్మగారు ఎన్నో నవలలు రాసి అటు కీర్తి ఇటు డబ్బు సంపాదించారు సుందరమ్మగారు అస్వస్థతవల్ల ఈ సభకు రాలేకపోయారు. వారి ప్రతినిధిగా వారి భర్త సత్యమూర్తిగారు మా కోరికపై ఈ సభలో పాల్గొంటున్నారు. మీరు అదృష్ట భర్త! ఇటువంటి భర్త వున్న ప్రతి రచయిత్రి ప్రతిభావంతురాలు కాగలదు. మీరు సుందరమ్మగారి నవలలు చదివేవుంటారు.

జగ : లేదు. నేను చదవలేదు. బి. ఏస్సి. చదివే మా మరదలు సుందరమ్మగారి నవలల గురించి నాకు చెబుతూ వుంటుంది. (సత్యమూర్తి కూర్చుంటాడు)

రమ : పరశురాంగారు! (పరశురాం లేచి నిలబడడు. రమణయ్య ముఖం చిట్లించి చూస్తూ కోర్టులో సాక్షిని పిలిచినట్టు బిగ్గరగా)పరశురాంగారు! (లేచి నిలబడమని సైగచేస్తాడు. అయిష్టంతో పరశురాం లేచి నిలబడతాడు) అభ్యుదయ కవులలో విపరీత అతివాది పరశురాంగారు. వీరి ధాటికి అభ్యుదయ కవులే ఆగలేరు. అంతటి పరమాభ్యుదయ కవి పరశురాంగారు!

పరశు : (కోపంతో) రమణయ్యగారూ! ఇక చాలు మీ పరిచయం. [కూర్చుంటాడు]

రమ : నాలుగు మాటలైనా చెప్పకపోతే న్యాయంగా వుండదు నేను ప్రెసిడెంటునుగనక పక్షపాతం చూపించకూడదు.

పరశు : పక్షపాతం చూపిస్తున్నట్టు అనిపించకూడదు - అంటే బాగుంటుంది.

రమ : పరశురాంగారి కవిత అతివాద రాజకీయ పక్షాలకు చెందిన పత్రికలలో మాత్రమే కనిపిస్తుంది. అందుచేత వారికి పేరు రాలేదు. ఈ మధ్యనే పరశురాంగారు దిగంబర కవులలో కలిసిపోయారు.

జగ : దిగంబర కవులగురించి విన్నాను. ఆ పేరే కర్ణకఠోరంగా వుంది.

పరశు : [వెంటనే] మాకు కావలసింది అదే! ప్రజల ఆర్తనాదం వినిపించని పాలకుల కర్ణపుటాలను అదరకొట్టడం మా ధ్యేయం. విగతకర్ణుల కర్ణాలలో శంఖం పూరిస్తాం. విప్లవ గీతం వినిపిస్తాం.

శిరో : [వెంటనే] కొత్త పదాలను సృష్టిస్తున్నావేమిటి మహానుభావా? మన ప్రాచీన గ్రంథాలలో కర్ణుడు వున్నాడు. వికర్ణుడు వున్నాడు. ఈ కాలం పత్రికలవాళ్ళు సుకర్ణుడిని కూడా పట్టుకొచ్చారు. ఇప్పుడు నువ్వు విగతకర్ణులను సృష్టిస్తున్నావు.

పరశు : విగత కర్ణులను సృష్టించింది నేను కాదు — అది మీ అమెరికన్ మార్కు రాజ్యాంగం సృష్టి! గతించిన కర్ణములు గలవాడు విగతకర్ణుడు. అతనికి నిరుపేదల ఆర్తనాదం వినిపించదు. ఆకలితో మాడి చచ్చే ప్రజల ఘోష అతని చెవికి సోకదు. పాలకవర్గానికి అతనే ప్రతినిధి. ఆకలి చావులు లేవని తన తాబేదారులు పంపే రిపోర్టులు మాత్రమే అతను చూస్తాడు. చావు కేక అతని చెవికి సోకదు.

రమ : అయ్యా! పరశురాంగారూ! మన తర్జన భర్జనలు, విమర్శలు వాద ప్రతివాదాలు నిత్యం జరుపుకుంటూనే వున్నాం. ఇప్పుడు శ్రీ జగన్నాథంగారు మనమీద అభిమానంతో మన సమావేశానికి దయచేశారు. వారి అమూల్యమైన అభిప్రాయాలు మనం వినవలసిన అవసరం ఎంతైనా వుంది. శ్రీ జగన్నాథంగారిని సాహిత్యం గురించి నాలుగు మాటలు చెప్పమని ప్రార్థిస్తున్నాను.

జగ : [లేచి నిలబడి - ఫ్లవర్ వేజ్‌లో వున్న పువ్వులను సర్దుతూ] నేటి కల్లోల ప్రపంచంలో రచయిత నిర్వహించవలసిన పాత్ర చాలా గొప్పది. రచయితలు హక్కుల కోసం పోరాటం జరిపే బదులు - తమ బాధ్యతలను నిర్వహించడం నేర్చుకోవాలి. తిరుగుబాటు కవిత్వం రాసేవాళ్ళను; వర్గ కలహాలను ప్రోత్సహించే వాళ్ళను; ఆకలి, దరిద్రం, చావులు, శ్మశానాలు, గెద్దలు, రాబందులూ గురించి రాస్తూ - ప్రజలను తప్పుదారి పట్టించే కవులను, రచయితలను మేం తప్పకుండా శిక్షిస్తాం. అందుకు అవసరమైతే మేం చట్టాన్ని కూడా సవరించగలం. అదృష్టవశాత్తు అలాంటి చౌకబారు కవులు చాలా తక్కువమంది వున్నారు. అమాయకులైన ప్రజల్ని తప్పుదారి పట్టించే ఈ గందరగోళం కవులకు అలంకార శాస్త్రం తెలియదు. వ్యభిచారీ, సంచారీ, మున్నగు భావాలు గురించి అసలే తెలియదు. మన ప్రాచీన కావ్యా లెందుకు శతాబ్దాల తరబడి నిలిచి వున్నాయి? ప్రాచీన కవులు శృంగార కరుణ రసాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు. రమణయ్యగారి రచనలలో, శిరోమణిగారి కవితలో పది శతాబ్దాలకు పూర్వం ఉన్న మహోన్నత ఉదాత్త భావాలు గోచరిస్తాయి. రమణయ్యగారు సాహిత్యానికి చేస్తున్న సేవను మేం గుర్తించాం. రేపు నిర్మించబోయే సారస్వత సలహా సంఘంలో రమణయ్యగారిని ఒక సభ్యుడిగా తీసుకుంటున్నామని మీకు ముందుగా తెలియచెయ్యడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. [హర్షధ్వానాలు. రమణయ్య ముఖంలో సంతోషం, కృతజ్ఞత, ఠీవి ఒకదానివెనక ఒకటి కనిపిస్తాయి] ముందు మీరంతా మాట్లాడిన తరువాత నేను చివరిని నాలుగు మాటలు చెబుతాను [కూర్చుంటాడు]

రమ : [వెంటనే లేచి] మీ అందరి సమక్షంలోను శ్రీ జగన్నాథం గారికి కృతజ్ఞత తెలియచేస్తున్నాను. [శిరోమణి లేచి రమణయ్యతో నెమ్మదిగా ఏదో చెబుతాడు. వెంటనే రమణయ్య సభాసదుల నుద్దేశించి] ఇప్పుడు శిరోమణిగారు జగన్నాథంగారిపై తాము రాసిన పద్యం చదువుతారు. [కూర్చుంటాడు]

శిరో : [లేచి గొంతు సవరించుకొని, రాగం తీసి పద్యం చదువుతాడు.]

నిరతము నృత్య గాన వినోదముల ము
నుగుచు తేలుచున్, అ ితులకు కవులకు
పదవు లిచ్చుచు మెచ్చుచున్, ప్రతిభ మీర
యిలను పాలించుచుం ి కలియుగేంద్ర !

చంద్ర : [వెంటనే లేచి] రమణయ్య గారూ ! నేను వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను. ఈ సమావేశం ఎందుకో నాకు అర్థం కావడంలేదు. మీ మాకు రాసిన ఉత్తరాలలో సంతాప సభ అని తెలియచేశారు. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే అంతా అయోమయంగా వుంది. ఇది సంతాప సభా ? సన్మాన సభా ?

రమ : [లేచి] దయచేసి కూర్చోండి, [శిరోమణి, చంద్రశేఖరం కూర్చుంటారు] చంద్రశేఖరంగారికి, ఇతర మిత్రులకు మనవి. ఇవేళ సంతాప సభ జరుగుతుందని మీ అందరికీ తెలియచేసిన మాట వాస్తవమే ! కానీ, ఇది మన రచయితల సంఘ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు. రాజధాని వెళ్ళినా దొరకని శ్రీ జగన్నాథంగారి దర్శనం మనకు అయాచితంగా లభించింది. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవడం మంచిది. ఈ సమావేశం ముగిసిన వెంటనే సంతాప సభ జరుపుకుందాం.

చంద్ర : ఆ సంగతి ముందుగా తెలియజేస్తే మాకు కొంత శ్రమ తప్పి వుండేది.

పరశు : [లేచి] రమణయ్యగారూ ! మీరు ప్రకటించినట్టు ముందుగా సంతాప సభ జరుపుతారా ? లేకపోతే మమ్మల్ని వాకౌట్ చెయ్యమంటారా ?

జగ : [రమణయ్యతో రహస్యంగా] ఏమిటది ?

రమ : [వినయంగా] అయ్యా ! మా రచయితల సంఘంలో ఒక ప్రముఖ సభ్యుడు మరణించాడు. వారి మృతికి సంతాపం తెలియజెయ్యడంకోసం సమావేశం ఏర్పాటు చేసిన మాట వాస్తవమే !

జగ : ఓ ! అదా సంగతి ! మీరు నాకోసం మీ కార్యక్రమం మార్చుకోనక్కరలేదు. ముందు సంతాప సభ కానివ్వండి.

రమ : [అందరికేసి తిరిగి] మనం ముందుగా సంతాపసభ జరుపుకొవడానికి శ్రీ జగన్నాథంగారు అంగీకరించారు. ఇది వారి హృదయ వైశాల్యానికి తార్కాణం — నేను రచయితల సంఘానికి అధ్యక్షుణ్ణి కనక యీ సభను నేనే ప్రారంభించవలసిన అవసరం వుంది. రఘుపతిగారి అకాల మరణానికి మనం మన గాఢ సంతాపాన్ని తెలియజెయ్యడం యీ సభ ముఖ్యోద్దేశం. రఘుపతి ఎన్నోకథలు రాశారు. మణిపూసలాంటి నవల ఒక్కటే రాశారు. ఆయన కథలలో మధ్య తరగతి, అడుగు తరగతి ప్రజల జీవితాలను చిత్రించారు. ఆయన రచనల్లో కూడా అతివాద ధోరణి కనిపిస్తుంది. అదొకటే ఆయనలోని లోపం. గర్వం, అహంభావం మచ్చుకైనా లేవు. ప్రథమ కోపి. అంతే - ఆయన స్వవిషయం చంద్రశేఖరంగారికి బాగా తెలుసు. వ్యక్తిగత సమస్యలు చాలా వున్నాయని - కొన్ని విచారాలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని విన్నాను. ఏది ఏమైనా మనం ఒక మంచి రచయితను కోల్పోయాం. [ఫైలులోంచి ఒక కాగితం తీసి జగన్నాథానికి ఇచ్చి కూర్చుంటాడు.]

జగ : [లేచి] శ్రీ శిరోమణిగారు ! [కూర్చుంటాడు]

శిరో : [లేచి గొంతు సవరించి] రఘుపతి అనే కుర్రవాణ్ణి నేను ఒకటి రెండుసార్లు చూడడం తటస్థించినది. పసిపిల్లల వచ్చి రాని మాటలు - వాటిలో ఎన్ని అపభ్రంశాలు ఉన్నప్పటికిన్నీ తల్లి దండ్రులకు కర్ణామృతంగానే ఉంటాయి. అదే విధంగా రఘుపతి రాసిన కథలు మనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఆత్మహత్య ఘోర పాతకమని మన శాస్త్రాలు ఘోషిస్తున్నప్పటికీ శాస్త్ర విరుద్ధముగా రఘుపతి ఆత్మహత్య చేసుకోవడం శోచనీయం. రచయితలు ఆత్మహత్యలు చేసుకోవడం విదేశీ సంప్రదాయమేకాని స్వదేశీ సంప్రదాయం కాదు. ఆత్మహత్య చేసుకున్న రచయిత ఆత్మ శాంతికి సంతాప సభ జరపడం ఆత్మహత్యలను ప్రోత్సహించడమే అవుతుంది.

పరశు : [కోపంతో లేచి సీరియస్‌గా] మిస్టర్ శిరోమణీ !

రమ : [వెంటనే] కూర్చోండి ! ఇప్పుడు మాట్లాడవలసింది మీరు కాదు.

జగ : [వెంటనే] గోపాలం.

గోపా : [లేస్తాడు. పరశురాం కోపంతో కూర్చుంటాడు. శిరోమణి ముసిముసి నవ్వులతో కూర్చుంటాడు. గోపాలం బెదురు చూపులతో అందరినీ చూస్తూ] రఘుపతిగారు రాసిన కథలు బాగానే వున్నాయి. స్వల్పమైన లోపాలు అక్కడక్కడ వున్నా యువతీ యువకులను ఆ కథలు బాగా ఆకర్షించాయి. ఆయన కథలు చదివిన ఒక అమ్మాయి ఆయన్ని ప్రేమించి పెళ్ళిచేసుకొందికూడా ! ఆయన కథలు పుస్తక రూపంలో ఇంతవరకూ రాలేదు. ఆయన అముద్రిత రచనలన్నీ ప్రచురిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. [కూర్చుంటాడు]


రమ
పౌడర్

జగ : [లేచి] శ్రీ సత్యమూర్తి ! [కూర్చుంటాడు]

సత్య : రఘుపతిగారి గురించి మా ఆవిడ ద్వారా నాకు తెలిసిన సంగతి ఏమంటే - ఆయన పెద్ద పేరున్న రచయిత కాదు. ఈ రోజున మన ఆంధ్రదేశంలో ఇద్దరో, ముగ్గురో రచయిత్రులకు మాత్రమే చాలా గొప్ప పేరు వుంది. ఆ ముగ్గురిలోనూ ఎక్కువ పేరుండి, అందరికంటే ముందే చెప్పవలసిన రచయిత్రి ఎవరో నా అంతట నేనే చెప్పుకోవడం మంచిదికాదు. అది మీ కందరికీ తెలిసిందే! ఈ రచయిత్రులను చూడ్డానికి చిన్నలూ - పెద్దలూ మంత్రులూ - అధికార్లూ, తాత్కాలిక గవర్నర్ల భార్యలు. కేంద్ర మాజీ మంత్రులు కూడా వచ్చి వెళుతున్నారంటే ఎంత పేరుందో మీరు తెలుసుకొనగలరు. మా ఆవిడకి ఇంత పేరు రావడం చూసి చాలామంది పాత రచయితలు చాలా అసూయపడుతున్నారు. ఒక రచయిత ఉద్యోగ రీత్యా నన్ను ఇబ్బందులలో పెడుతున్నాడు. కానీ, మా ఆవిడ ఊరుకోవడంలేదు. పేరు వున్న ప్రతి రచయితనీ పట్టుకొని ఏకేసి వదిలిపెడుతోంది. ఒక మగ రచయిత రెండో పెళ్ళి చేసుకున్నాడని. మరో రచయితకు మగపిల్లలు లేరని. ఒక రచయిత్రి సంస్కృతం రాకుండా శ్లోకాలు రాస్తుందని - మా ఆవిడ ఈమధ్య కొన్ని నవలలలో ఛాప్టర్లకు ఛాప్టర్లే రాసింది. ఇంతకూ చెప్పొచ్చే దేమంటే, చెయ్యి తిరిగిన వాళ్ళకు నవల రాయడం చాలా తేలిక. వాళ్ళేం రాసినా బంగారంలా చెలామణీ అయిపోతోంది. ప్రేమ. మనిషిలో ఉన్న బలహీనత. మూర్ఖపు ఆలోచనలు - బయటపెట్టే నవల. పైకులం అమ్మాయి కింది కులం అబ్బాయిని పెళ్ళాడ్డం, ఆ తరవాత అమ్మాయికి అబ్బాయికి ఘర్షణ - బొబ్బిలి గొర్రెపోతు మందాల లాగ అమ్మాయి వెనకాల కొంతమంది. అబ్బాయి వెనకాల కొంతమంది చేరి ఇద్దరినీ ఉసిగొలపడం - చివరకు చావుతోనో, కలుసుకోడంతోనో నవల పూర్తవుతుంది. వారం రోజులు తీరుబాటు సమయంలో రాసిన నవలకు వెయ్యిరూపాయలొస్తున్నాయంటే ఇది చాలా గొప్ప కాలం. (రమణయ్య కేసి తిరిగి) దీన్నేమంటారు?

రమ : స్వర్ణయుగం.

సత్య : (ప్రసంగం కొనసాగిస్తూ) ఈ స్వర్ణయుగంలో నిజంగా రచయిత అన్నవాడు — బుర్రలో సరుకున్నవాడు - ఎంతయినా డబ్బు చేసుకొనడానికి వీలుంది. ఇలాంటి లోకంలో బతకలేక విలువైనా తన ప్రాణాలు తనే తీసుకున్నాడంటే అది పూర్తిగా రఘుపతిగారి లోపమే. (కూర్చుంటాడు)

జగ : (లేచి) చంద్రశేఖరం (కూర్చుంటాడు)

చంద్ర : (లేచి విచారంతో) నేను ఎన్నో సంగతులు మాట్లాడదామనుకున్నాను. తీరా ఇక్కడ పరిస్థితి చూస్తే మరో విధంగా వుంది. రఘుపతి చివరి ఉత్తరం నాకు నిన్ననే అందింది. అందరూ మాట్లాడిన తరువాత ఆ ఉత్తరం చదివి వినిపిస్తాను. అతని చివరి కోరిక తీర్చడం మన ధర్మం! కనీసం అదైనా జరుగుతుందని నేను ఆశిస్తున్నాను. ఇంతకు మించి మాట్లాడే దేమీ లేదు. (కూర్చుంటాడు.)

గోపా : (కుతూహలంతో) ఏమిటండీ ఆ చివరి కోరిక?

శిరో : (హేళనగా) స్మారక చిహ్నం ఏదైనా కావాలంటాడా ఏమిటి?

రమ : (మామూలుగా) తన అముద్రిత రచనలన్నీ ముద్రించమని కోరి వుంటారు. రచయితకు అంతకంటే కావలసింది ఏమి వుంటుంది? (జగన్నాధంతో) అయ్యా! తమరు కానివ్వండి.

జగ : (లేచి) పరశురాం! (కూర్చుంటాడు)

పరశు : (లేచి) సంతాప సభను తన స్వార్థంకోసం సన్మాన సభగా మార్చిన రమణయ్యగారికి ముందుగా నా అసమ్మతి తెలియచేస్తున్నాను. మన సమాజంలో మూడు వర్గాల రచయితలు వున్నారు. ధనిక పాలక వర్గాన్ని ఆశ్రయించి - వాళ్ళకు వంది మాగధుడై తన రచనలద్వారా ప్రమోషను. కీర్తి సంపాదించే రచయిత మొదటి వర్గంవాడు. ఇతడే పాలక వర్గం దృష్టిలో ప్రథమశ్రేణికి చెందినవాడు. పది శతాబ్దాల నాటి పాత చింతకాయ పచ్చడి కవి. రెండవ తరగతి రచయితకు ఉండవలసిన లక్షణాలు రచయిత్రి భర్త సత్యమూర్తిగారు చెప్పారు. ఆయన పేరు చాలాసార్లు ఉదహరించవలసివుంది కనక — సౌలభ్యం కోసం పొడి అక్షరాలు ఉపయోగిస్తాను. రభసగారి దృష్టిలో రచన అతి తేలిక! మనిషిలోని మూర్ఖపు ఆలోచనల్ని, బలహీనతల్ని ఆసరాగా తీసుకొని బోలెడు డబ్బు చేసుకోవచ్చు. నిజం చెప్పిన రభసగారి నిజాయితీ ప్రశంసనీయం! లాభాలకోసం తిండివస్తువులలో కల్తీచేసే కల్తీ వర్తకుడి లాంటివాడు రెండో తరగతి రచయిత. అతనికి కావలసింది డబ్బు! డబ్బు! డబ్బు! శృంగారానికి మార్కెట్టు వుంటే పచ్చి శృంగారం రాస్తాడు. హత్యా సాహిత్యాన్ని మార్కెట్లో ప్రవేశపెడతాడు. ఇక మూడవ తరగతి రచయిత. అతను ఎక్కడికీ వెళ్ళడు. ఎవరినీ ఆశ్రయించడు. సామాన్య ప్రజానీకంతో కలిసి బ్రతుకుతాడు. ఏడుస్తాడు. బాధపడతాడు. నేటి ఆర్థిక వ్యవస్థ ఇనుప పాదాలకింద పడి నలిగిపోతున్న అభాగ్యుల జీవితాలను, వాళ్ళ రాగద్వేషాలను రాస్తాడు. రచయితల జాతిలో అతను ఈనాడు కడజాతివాడు. పాలకవర్గం దృష్టిలో అతనికి విలువలేదు. బ్రతుకుతెరువుకు ఆస్కారం లేదు. నౌకర్లుగా, శ్రామికులుగా బ్రతుకుతున్నారు వాళ్ళు. ఇబ్బందులకు తట్టుకోలేక, ఆత్మవంచన చేసుకోలేక-ఆత్మహత్య చేసుకున్న రఘుపతి మూడవ తరగతికి చెందిన

రచయిత : శ్రీ శ్రీ శ్రీ గన్నాధులవారి సూక్తి ప్రకారం నిజం చెప్పినవారు దండి పబడుదురు. ఇలాంటి సమాజం నుంచి విజాయితీ గలవాడ నిష్క్రమించక తప్పదు. ఇది నా అశ్రుగీతం. రఘుపతి అంకితం. పుస్తకం తెరిచి వచన గీతం చదువుతాడు.

నిష్క్రమించు, నిష్క్రమించు నువ్వీ లోకానికి
తగని తండ్రీ
మోసం చెయ్యడం రాని నీకు - రోషం చూపిస్తా
వెందుకు ?
లోకంలో కుళ్ళు తీసి - లోకుల కళ్ళకు చూపిస్తే
నీ చుట్టూ జరుగుతున్న ఘోరాలను నేరాలను చిత్రిస్తే
చేనును మేస్తున్న కంచెను - వంచకులను ముందంలో
చూపిస్తే
విను మెచ్చరు సరికదా , గుచ్చి గుచ్చి బాధిస్తారు.
మారుమూల కూచుని లోకంకోసం మానవ కల్యాణం
కోసం
నిశీథంలో నిరాడంబరంగా రాస్తానంటావు నువ్వు !

అందుకే నిన్నెవరూ గుర్తించలేదు
ఇంతకూ నువ్వెవరివో లోకానికి తెలియదు.
అది నీ లోటు కాదంటావు నువ్వు !
అది నిజమని నేనూ ఒప్పుకుంటాను !
మనపైని వున్నవాళ్ళు, మనల్ని పాలించేవాళ్ళు
కవితను..కళలను మూడు ఉరితాళ్ళలో ముచ్చటగా
బిగించినవాళ్ళు
కళామతల్లి చుట్టూ కంచె పాతినవాళ్ళు
వాళ్ళ మెప్పు పొందాలని నీకుంటే
పదిమందిలోనూ కలవాలని నీకుంటే
పై మెట్టుకు పాకాలని నీకుంటే
పదిమందిని చుట్టూ చేర్చుకో !
చెక్క భజన నేర్చుకో !
కళలకోసం కేటాయించారు లక్షలకు లక్షలు
నువ్వు చెయ్యి చాస్తే వేస్తారు భిక్ష
వాళ్ళా.... ఈనాటి కళా పోషకులు
వాళ్ళే నీ దృష్టిలో కళా కీచకులు
కన్నీటినీ రక్తకన్నీటినీ చూడలేరు వాళ్ళు


# RAO BROTHERS (Regd.) GUNTUR-1.

B. A and B. Com, Questions and Answers Books Ready for sale

| | | Rs. Ps. |
|---|---|---|
| 1. | MODERN EUROPE by S. Sundaram | 4 00 |
| 2. | MONEY, BANKING, INTERNATIONAL TRADE & PUBLIC FINANCE by J. Parabrahmam & A. Venkateswarlu | 5 50 |
| 3. | ECONOMIC PROBLEMS OF INDIA by J. Parabrahmam and A. Venkateswarlu | 5 50 |
| 4. | GENERAL ECONOMICS by G. Subrahmanyam | 5 00 |
| 5. | THEORY and PRACTICE OF BANKING by J. Parabrahmam | 4 50 |
| 6. | RURAL and INDUSTRIAL ECONOMICS by J. Parabrahmam and A. Venkateswarlu | 5 50 |
| 7. | PUBLIC ADMINISTRATION by A. Pullaiah | 4 50 |
| 8. | INDIAN HISTORY VOL I (Ancient India) - by V. T. Veeram Raju | 3 75 |
| 9. | INDIAN HISTORY VOL II (Medieval Period) by V. T. Veerarm Raju | 3 00 |
| 10. | INDIAN HISTORY VOL III (Modern Period) by V. T. Veeram Raju | 3 00 |
| 11. | GENERAL EDUCATION by A. Pullaiah | 3 00 |
| 12. | BUSINESS ORGANISATION by G. Subrahmanyam | 5 00 |
| 13. | AUDITING by J. Parabrahmam and others. | 3 50 |

కొంత భజన ప్రియులు వాళ్ళు
కళ్ళు దించి కిందికి చూడలేరు వాళ్ళు
అందుకే నివాసాల్ని ఎత్తుకు తరలించారు వాళ్ళు
లోకంలో కరువు కాటకాలొచ్చినా
లోకులు అన్నంకోసం అరిచి చచ్చినా
అయిదేళ్ళదాకా వినిపించదు వాళ్ళకు !
వాళ్ళు అవునన్నది కవిత్వం — కాదన్నది దేశద్రోహం
నిజమైన కళాకారుల్ని నిర్మూలించగలరు వాళ్ళు
కోకిలా అరిచి 'కాకా' పట్టేవాళ్ళను పైకెత్తగలరు
వాళ్ళు
విశ్రమించు ! విశ్రమించు !!

శిరో : (లేచి ఆవేశంతో) అయ్యా ! ఇది కవిత్వం అంటే ఎలా ఒప్పుకోమంటారు ?

పరశు : (వెంటనే) ఒప్పుకోకపోతే మానెయ్ ! ఒప్పుకోమని ఎవరు బతిమాలారు ?

శిరో : (అదే ధోరణిలో) పోనీ .... నీ కవితలో వున్నది యే రసం ?

పరశు : (సీరియస్‌గా) నీరసం ! నిరసనలోంచి నిరుత్సాహంలోంచి పిసలైన కవిత్వం వస్తుందని గుర్తించాలి.

శిరో : మరి ఈ కవిత్వం ఎవరికోసం ?

పరశు : శిరస్సు ఉన్నవాళ్ళ కోసం ! అంతేకాదు. మీలాంటి శిరస్సు లేని శిరోమణులకోసం కాదీ కవిత్వం !

శిరో : (కోపంతో - సభానదుల నుద్దేశించి) అయ్యా ! ఇతగాడు వ్యక్తిదూషణ చేస్తున్నాడు.

రమ : (వెంటనే లేచి) పరశురాంగారూ ! శిరోమణిగారూ ! దయచేసి కూర్చోండి.

శిరో : (కోపంతో) పరులను దూషించకూడదని అతనికి బుద్ధి చెప్పండి. (కూర్చుంటాడు.)

పరశు : ఆత్మస్తుతి, పరనింద మీవంటి కవి సమ్రాట్టులనుంచి నేర్చుకొన్న విద్య ! (కూర్చుంటాడు)

రమ : (చంద్రశేఖరంకేసి తిరిగి) చంద్రశేఖరంగారూ ! మీరు రఘుపతిగారి ఉత్తరం చదివి వినిపించండి. (కూర్చుంటాడు)

చంద్ర : (లేచి ఉత్తరం చదువుతాడు.)

"శేఖరం !

నీకు కోపం వస్తుంది. బాధపడతావు. నాకు తెలుసు అయినా, నేనీ లోకం విడిచిపెట్టక తప్పదు. మరో మార్గం లేదు. ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకున్నాను. సుఖ దుఃఖాలు రెండూ అనుభవించాను. సుమతి కోరికమీదే ఇద్దరం విడిపోయాం. కేవలం ఉదరపోషణకోసం అష్ట కష్టాలూ పడ్డాను. ఏ ఉద్యోగం నాకు సరిపడలేదు. కాదు, కాదు. నేనే ఏ ఉద్యోగంలోనూ ఇమడలేకపోయాను. శారీరకంగా, మానసికంగా నీరసించిపోయాను. గత రాత్రి నన్ను నేనే విమర్శించుకున్నాను. నేను లోకానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాను ? లేనప్పుడు నేనెందుకు బతకాలి ? ఒక నిర్ణయానికి వచ్చాను. గతంలో చేసిన తప్పులూ, నేరాలూ ఏమైనా వున్నాయా అని ఆలోచించాను. లోగడ ఇబ్బందులకు తట్టుకోలేక కేవలం డబ్బుకోసమే కొన్ని కథలు రాశాను. నా అనంతరం నేను చేసిన పాపానికి చిహ్నంగా నా రచనలు ఉండకూడదు. ఇప్పుడే ఒక ఐదు నిముషాల క్రితం నా దగ్గర వున్న వ్రాతప్రతులన్నీ తగలబెట్టేశాను. నిన్ను నేను కోరేది ఏమంటే, నారచన ఎక్కడ కనిపించినా వెంటనే కాల్చెయ్. ఈ ప్రపంచంలో నాస్మృతిచిహ్నంగా ఏదీ మిగలకూడదు. ఇదే నా చివరి కోరిక.

నీ
రఘుపతి."

[చంద్రశేఖరం కూర్చుంటాడు.]

గోపా : (వెంటనే) రఘుపతిగారి మరణవార్త వినగానే, ఆయన రచనల్ని పత్రికలు పెద్ద అక్షరాలతో ప్రచురిస్తున్నాయి.

రమ : (లేచి) చంద్రశేఖరం గారూ ! ఆయన చివరికోరిక మనం తప్పకుండా తీర్చాలంటారా ?

పరశు : (కలగచేసుకొని) తీర్చితీరాలి. తిరుగులేదు.

శిరో : (వెంటనే) కూడదు. తగలబెట్టడం ఘోరపాతకం ! అయినా అతని ఉద్దేశం అదై వుండదు. తగల బెట్టమని తనంత తానే రాస్తే — పెద్ద పేరొస్తుందని అతని ఊహ ! చూడగా చూడగా ఇదేదో ప్రచారపు ఎత్తుగడలా కనిపిస్తోంది.

చంద్ర : (సీరియస్‌గా) కాదు ! బ్రతికి వున్నప్పుడే పేరు కోసం ప్రచారం కోసం ప్రయత్నించలేదు. మీ కళ్ళతో అతన్ని చూడ్డం ధర్మంకాదు.

పరశు : (నొక్కి చెబుతూ) రఘుపతి చివరి కోరిక తీర్చితీరాలి.

శిరో : (నొక్కి చెబుతూ) తీర్చడానికి వీల్లేదు. పదివేలు చందాలు వసూలుచేసి అతని పుస్తకాలన్నీ అచ్చువేసి— అతను మనసులో కోరుకున్నటువంటి కోరికను తీర్చి — అతని ఆత్మకు శాంతి కలిగించాలి. ఏం రమణయ్యగారూ ! మీరు నాతో ఏకీభవిస్తారా ?

రమ : అయ్యా ! నేను అధ్యక్షుణ్ణి గనక ఏ ఒక పక్షం తరపున మాట్లాడ్డం ధర్మంకాదు.

పరశు : (ఆవేశంతో) నేను తీర్మానం ప్రతిపాదిస్తున్నాను. "రఘుపతి ఆత్మశాంతి కోసం అతని చివరికోరిక తీర్చడానికి ఈ సభవారు ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నారు !"

శిరో : (వెంటనే బిగ్గరగా) నేను వ్యతిరేకిస్తున్నాను.

రమ : (కలగజేసుకొని) అయ్యా ! శిరోమణిగారూ ! పరశు రాంగారూ ! (యిద్దరూ కుర్చుంటారు) రఘుపతిగారి చివరి కోర్కెను అమలు జరపాలా - లేదా - అన్నది ఇప్పుడు వివాదాంశం ! పాఠకులు, సుప్రసిద్ధ నాయకులు న్యాయశాస్త్ర నిపుణులు అయిన శ్రీ జగన్నాథంగారిని సమ తీర్పు చెప్పమని - ఆ తీర్పుకు బద్ధులమై వుంటామనీ మీ అందరి తరపునా శ్రీ జగన్నాథంగారిని కోరుతున్నాను. (కూర్చుంటాడు.)

జగ : (లేచి) రఘుపతి రాసిన ఉత్తరం జాగ్రత్తగా విన్నాను. ఆ ఉత్తరంలో కనిపించిన ముఖ్య విషయం - అతనికి ఆ క్షణంలో మనసు నిలకడలేదు. మతి చలించడమే అతని ఆత్మహత్యకు కారణం. కనక అతని కోరికను నూటికి నూరు పాళ్ళు అమలు జరపవలసిన అవసరంలేదు. అతని రచనల్లో శృంగార కరుణ రసాలకు ప్రాధాన్యం వున్న కథలన్నీ సేకరించి - కొన్ని సంపుటాలు ప్రచురించడం అత్యుత్తమమైన పద్ధతి. రౌద్ర భీభత్స రసాలతో - దరిద్రాన్ని చావులను చిత్రించిన కథలన్నీ నామరూపాలు లేకుండా తగలబెట్టడం సమాజ శ్రేయస్సు దృష్ట్యా అత్యవసరం ! అలా చేసినందువల్ల అతని చివరి కోరికలో సగం తీర్చినట్టు కూడా అవుతుంది. అతని శృంగార కథలు ప్రచురించడానికి నేను ఐదు వందల రూపాయలు విరాళం ఇస్తున్నాను.

[చంద్రశేఖరం, పరశురాం మినహా అందరూ హర్ష ధ్వానాలు చేస్తారు.]

పరశు : (కోపంతో) ఇది సంతాప సభ కాదు ! అవమాన సభ ! ఈ సభను మేం నిషేధిస్తున్నాం.

[పరశురాం, చంద్రశేఖరం నిష్క్రమిస్తారు.]

జగ : (తన ఉపన్యాసం ముగిస్తూ) మా రాజకీయాల్లో ఉన్నట్టే మీ రచయితల సంఘంలో కూడా ముఠా తగువు లున్నట్టు కనిపిస్తోంది. రమణయ్యగారి వంటి సమర్థుడు ప్రెసిడెంటుగా వుండి కూడా - ఇలాంటి అరాచక శక్తులకు సంఘములో చోటు యివ్వడం దారుణం. చౌకబారు రచయితల్ని తక్కువ తరగతి రచయితల్ని - ఎప్పుడూ కుళ్ళూ, ఏడుపూ చావూ తప్ప సంఘంలో మంచిని, సంతోషాన్నీ చూడలేని రచయితల్ని మీ సంఘంనుంచి వెళ్ళగొట్టడం ఎంతైనా అవసరం !

(అందరూ హర్షధ్వానాలు చేస్తూ వుండగా—)

[ తెర ]


దీపావళికి

పాఠకులకు, మా శ్రేయోభిలాషులకు మా శుభాకాంక్షలు

ఆయుర్వేదౌషధములనే ప్రోత్సహింపుడు

కేవలాగు, వైద్యసలహా ఉచితము.

శ్రీ భుజంగరావు వైద్యశాల

ప్రొప్రయిటర్సు : "భిషక్‌శిరోమణి" పాన్నాడ పేరయ్యా అండ్ సన్సు

హెడ్డాఫీసు : తాళ్ళరేవు, తూర్పుగోదావరి జిల్లా.